విశాఖ నగరానికి ముఖద్వారం గాజువాక. పారిశ్రామికంగా ప్రగతి సాధించిన ఈ ప్రాంతం కొత్తగాజువాక, పాతగాజువాకల సమ్మేళనంగా భాసిల్లుతోంది. కొత్త గాజువాక ఏర్పడి దాదాపు 60 ఏళ్లు కావస్తున్నా అది ఇంకా కొత్త గాజువాకగానే వర్ధిల్లుతోంది. మరి పాతగాజువాక ఎప్పుడు ఏర్పడింది.. ఏమిటా కథ..!

ప్రకృతి ఒడిలో ఎదిగిన ప్రాంతం గాజువాక. 1965కు ముందు రకరకాల పేర్లతో ఉండేది. చారిత్రక నేపథ్యం తెలిసినవారు, వృద్ధులు చెప్పే కథనం ప్రకారం 1965 నుంచి గాజువాక పేరు వాడుకలోకి వచ్చింది. పరిశ్రమలు రావడంతో ఈ ప్రాంతం ప్రగతి పరవళ్లు తొక్కింది. **దీంతో గాజువాక శరవేగంగా విస్తరించింది. దీంతో అప్పటి దాకా గాజువాకగా ఉన్న ఈ ప్రాంతం పాతగాజువాక, కొత్తగాజువాకగా రూపాంతరం చెందింది.**

ప్రగతి పతాక... గాజువాక

- వల్లె నుంచి పారిశ్రామిక నగరంగా ఖ్యాతి
- అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి కేంద్రం
- కొత్తగాజువాక.. పాతగాజువాకగా వికాసం

గాజువాక: నిరంతరం జనంతో కిక్కిరిసి ఉండే ప్రస్తుత పాతగాజువాక ప్రాంతాన్ని అంతకుముందు మెట్ట మర్రిపాలెంగా పిలిచేవారు. చట్టివానిపాలెం, ఆజీమాబాద్, వల్లావారి చేలు, ఉరుకూటివారి ఇళ్లు ఉన్న ప్రాంతాన్ని అప్పట్లో గాజువాకగా పిలిచేవారు. చినగంట్యాడ పంచాయతీకి ఇప్పటి పాతగాజువాక శివారు గ్రామంగా ఉండేది. ఆ తర్వాత



2009లో కొత్తగాజువాక ప్రాంతం



పదేళ్ల కిందట పాతగాజువాక

పాతగాజువాకను చినగంట్యాడ పంచాయతీ నుంచి వేరు చేసి పంతులుగారి మేడ, జోగవానిపాలెం, ఇప్పటి కొత్త గాజువాకను కలిపి గాజువాక పంచాయతీగా ఏర్పాటు చేశారు.



ప్రస్తుత పాతగాజువాక జంక్షన్

షాపింగ్ కేరాఫ్ కొత్తగాజువాక

1965 నాటికి ఇప్పటి పాతగాజువాక ప్రాంతంలో ప్రజలకు అవసరమైన వస్తువులు పెద్దగా లభించే పరిస్థితి ఉండేది కాదు. ఇక్కడి రామాలయం వద్ద ఒక కిరాణా దుకాణం ఉండేది. అది మూసేస్తే కిలోమీటరు దూరంలో ఉన్న కొత్తగాజువాక వెళ్లాల్సి వచ్చేది. గాజువాక పంచాయతీ ఏర్పడిన తర్వాత గాజువాక శివారులో కొత్తగా కొన్ని గ్రామాలు ఏర్పడ్డాయి. మార్కెట్, వ్యాపార సముదాయాలు వచ్చాయి. అందువల్ల బస్ స్టాప్ కూడా అక్కడే ఏర్పాటు చేశారు. అప్పట్లో గాజువాకకు రెండు ఆర్టీసీ బస్సులుండేవి. అవి ఎక్కాలన్నా ఇప్పటి కొత్త గాజువాక వెళ్లాల్సిందే. మొత్తం గాజువాకకు ఇక్కడే బస్‌స్టాప్ ఉండేది. ఆ బస్‌స్టాప్‌ను గాజువాక బస్ స్టాప్ అని పిలిచేవారు. ఆ తర్వాత బీహెచ్‌పీవీ, జింక్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ వంటి పరిశ్రమలు వచ్చాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి జనం వలస రావడం బాగా పెరిగింది. వారు వివిధ ప్రాంతాల్లో నివాసముండేవారు. వారు కూడా ఆయా పరిశ్రమలకు ఉద్యోగాలకు వెళ్లాలంటే కొత్త గాజువాక వరకు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వచ్చేది. దీంతో ఆర్టీసీ పాతగాజువాకలో కూడా ఒక బస్ స్టాప్ ఏర్పాటు చేసింది. ఆ రెండు బస్ స్టాప్‌లకు కొత్తగాజువాక, పాతగాజువాక అని పేర్లు పెట్టారు. అప్పటి నుంచి



గాజువాకను కొత్తగాజువాక, పాతగాజువాకగా పిలవడం ప్రారంభించారు. దీంతో ఎన్నేళ్లైనా కొత్తగాజువాక పేరు అలాగే స్థిరపడిపోయింది. అప్పటికే గ్రామాలు ఉన్న గాజువాకలో పాత ప్రాంతం పాతగాజువాకగా ముద్రపడిందని పెద్దలు చెబుతుంటారు.

కళ్ల ముందే ప్రగతి



గాజువాక ఎంతో శరవేగంతో అభివృద్ధి చెందింది. ఇప్పుడు మనం చూస్తున్న ప్రాంతం నగరానికి పోటీగా కనిపిస్తుంది. కానీ, అప్పట్లో సౌకర్యాలు నామమాత్రంగా ఉండేవి. నిత్యావసరాలు తప్పా మిగిలినవి ఏవి కావాలన్నా అటు విశాఖ నగరానికి, ఇటువైపు అనకాపల్లి వెళ్లేవాళ్లం. అప్పట్లో ఆ ప్రాంతాలకు వెళ్లి రావాలంటే ఒక రోజు మొత్తం సరిపోయేది. అయితే గాజువాక ప్రస్తుతం మెట్రో స్థాయిలో అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధిని చూస్తే గర్వంగా అనిపిస్తుంది.

మద్ది శంకర్‌రెడ్డి, గాజువాక.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. విశాఖపట్నం(ద్వారకా)ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకండ్ ఫ్లోర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ మేనేజ్‌మెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సు ల్లో చేరేందుకు ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, 10 తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్ల లోపువిద్యార్థినీ, విద్యార్థులు అర్హులన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ కోర్సులకు ఉచిత భోజన వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని వివరించారు. ఆసక్తి గల వారు తమ సంస్థలో గానీ, 9121999654, 7993011695 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేస్తున్న సంద్రాన కుటుంబ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శ్రీ దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల దేవాలయం నిర్మాణానికి సంద్రాన లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్ స్వర్గీయ సంద్రాన రమణమ్మ దంపతుల కుమారులు భారీ విరాళం అందజేశారు. శనివారం వారి కుమారులు (9 మంది) కలిపి రూ.6,00,001 విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్కు రూపంలో అందజేశారు.

క్లుప్తంగా

అన్నదాన నిధికి రూ.10 వేల వితరణ



దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న దాత వెంకట రామారావు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి అన్నదాన నిధికి దాతలు విరాళాలు విరివిగా అందజేస్తున్నారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన వెంకట రామారావు, గాయత్రి దంపతులు శనివారం రూ.10 వేల చెక్కును శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

దొంగ అరెస్ట్

- సెల్‌ఫోన్‌తో పాటు రూ.7 వేలు స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: రాత్రి వేళ సంచరిస్తూ విలువైన సెల్ ఫోన్లు, నగదు చోరీచేస్తున్న కండిపల్లి మణి లోకేష్‌ను దువ్వాడ క్రైం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 5వ తేదీన చిత్తూరు నుంచి గాజువాక మార్కెట్‌కు టమాటా లోడుతో లారీ డ్రైవర్ వచ్చాడు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో టమాటాలోడు దించి మరో లోడింగ్ కోసం కూర్మన్నపాలెంలోని రామచంద్ర లారీ ట్రాన్స్‌పోర్టుకు వెళ్లాడు. అర్ధరాత్రి కావడంతో లారీ అక్కడే పార్కింగ్ చేసి భోజనం అనంతరం క్యాబిన్‌లో సెల్ ఫోను, రూ.7 వేల నగదు పెట్టి పడుకున్నాడు. తెల్లవారి లేచి చూసే సరికి సెల్ ఫోను, నగదు కనపించకపోవడంతో గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం డీసీపీ పి.లతా మాధురి పర్యవేక్షణలో ఏసీపీ క్రైం జోన్ 1, 2 సీసీఎస్ వెంకటరావు, సౌత్ సెబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చోరీ చేసిన వ్యక్తిని గుర్తించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కండిపల్లి మణి లోకేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి సెల్ ఫోన్‌తో పాటు రూ.7వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రైం పోలీసులు మాట్లాడుతూ లారీ డ్రైవర్లు, ట్రాన్స్ పోర్టు డ్రైవర్లు రాత్రి పూట పడుకునే ముందు తమ విలువైన సామగ్రి, నగదును జాగ్రత్తగా భద్రపర్చుకోవాలన్నారు.


'వాతావరణ మార్పులు, వ్యవసాయం'పై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

విశాఖ సిటీ: వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం(ఏఈఆర్‌సీ), భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలిసి 'వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయం–సుస్థిర పద్ధతులు' అనే అంశంపై శనివారం ఏయూలో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవసరాన్ని వివరించారు. ఏఈఆర్‌సీ మాజీ డైరెక్టర్ డాక్టర్ టి.వి.ఎస్.రావు మాట్లాడుతూ వ్యవసాయంలో వాతావరణ మార్పులతో కూడిన సవాళ్లు, అవకాశాలను విశదీకరించారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జె.మోహనరావు మాట్లాడుతూ వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాల అన్వయంపై అనుభవాలను పంచుకున్నారు. సదస్సులో ప్రొఫెసర్ సాంబమూర్తి, ఏఈఆర్‌సీ పరిశోధకులు డాక్టర్ కె.ఆదిశేషు, డాక్టర్ కె.వి.గిరిబాబు, ఏఈఆర్‌సీ ఆనరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.లిల్లీగ్రేస్ యూనిస్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి మబ్బుల మణిహారం



పెదగంట్యాడ: మూడు రోజులుగా వర్షాలు కురిసిన తర్వాత శనివారం ఆకాశం ప్రశాంతంగా కనిపించింది. వెండి మబ్బులతో కనువిందు చేసింది. నీలాకాశం ధగధగ మెరిసిపోయింది. చూపరులను ఆకట్టుకుంది. పలువురు ఈ దృశ్యాన్ని పోటీపడి చిత్రీకరించారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి?

- ఆస్పత్రి సూపరింటెండెంట్‌కి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్

అగనంపూడి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మృత శిశువు జననంపై సమగ్ర విచారణ చేపట్టాలని శిశువు తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతికి ఫిర్యాదు చేశారు. రాత్రి విధులు నిర్వహించే వైద్యుని నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని, ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెదగంట్యాడ నిర్వాసిత కాలనీ నడుపూరుకు చెందిన నాగబిల్లి రాజు భార్య సుచిత్రను ప్రసవన కోసం శుక్రవారం ఉదయం అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అర్ధరాత్రి దాటిన తరువాత నొప్పులు కావడంతో రాత్రి విధుల్లో ఉన్న వైద్యుని దృష్టికి తీసుకువెళ్లారు. మొదటి కాన్పు కావడంతో రాత్రి విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సాధారణ ప్రసవం జరుగుతుందని వేచి ఉండాలని కసురుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున డెలివరి కాగా శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు విధుల్లో ఉన్న సిబ్బందిని నిలదీశారు. వైద్యుడు, సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం వల్లే ఇలా జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాజు, ఆయన బంధువులు శనివారం ఉదయం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఏపీవీవీపీ జిల్లా కోఆర్డినేటర్ శంకర్ ప్రసాద్ ఆస్పత్రికి చేరుకొని వైద్యులు, సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యుల్ని వేర్వేరుగా విచారించి వివరాలు నమోదు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- డీసీపీ -2 మేరీ ప్రశాంతి
- న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సందర్శన

పెదగంట్యాడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని డీసీపీ–2 మేరీ ప్రశాంతి సూచించారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. జనరల్ రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న



న్యూపోర్టు పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

నిర్వాహణ చర్యలను, పాత నేరస్తుల కదలికలను ఏ విధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. డయల్ 100 కేసుల్లో తక్షణమే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు, ఎస్ఐలు శ్యామ్‌సుందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గాజువాక కుర్రాడు' అలరించడం ఖాయం

- వేడుకగా ఆడియో లాంచ్
- డ్యాన్సులతో అదరగొట్టిన హీరో, హీరోయిన్లు



'గాజువాక కుర్రాడు' చిత్రం ఆడియోను లాంచ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: పారిశ్రామిక ప్రాంతంగా ప్రసిద్ధికెక్కిన గాజువాక ప్రాంతానికి సంబంధించి సినిమా నిర్మించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాకకు చెందిన సంజయ్, మౌర్య కర్ణిక హీరో హీరోయిన్లుగా.. మళ్ల తులసీరావు నిర్మాణంలో మళ్ల హేమ చందు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'గాజువాక కుర్రాడు'



చిత్రంలోని పాటకు డ్యాన్స్ చేస్తున్న హీరో సంజయ్

చిత్రం ఆడియోను స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పాటలు బాగున్నాయని, సంగీత ప్రియులను అలరిచండం హీరో హీరోయిన్లు, డ్యాన్సర్లు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు ప్రమోద్, సినీ నటుడు ప్రసన్నకుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కో ప్రొడ్యూసర్ మళ్ల హరికృష్ణ, మహ్మద్ రఫీ, రవితేజ పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కోవడంపై మాక్ డ్రిల్



అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది



క్షతగాత్రులకు ఫస్ట్ ఎయిడ్ చేసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

అగనంపూడి: పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు, రసాయనాలు లీకైనప్పుడు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించే సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ కంపెనీలో శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ అగ్నిమాపక విశ్రాంత ఇన్‌స్పెక్టర్ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే సమయాల్లో కార్మికులు ఎలా వ్యవహరించాలనే జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడానికి మాక్‌డ్రిల్స్ ఉపకరిస్తాయని చెప్పారు. అధికారులు, వివిధ విభాగాల మధ్య సమన్వయం ఎలా ఏర్పరుకోవాలనే విషయమై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండ్రీ సీనియర్ మేనేజర్ రమణమూర్తి, కంపెనీ భద్రతా అధికారి నీలకంఠరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రీ గార్డులు ధ్వంసం



ప్రమాదకరంగా ధ్వంసం చేసిన ట్రీ గార్డులు

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెంలో ట్రాన్స్ పోర్టు కార్యాలయాల సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా, హై వే మధ్య ఏర్పాటు చేసిన ట్రీ గార్డులను ధ్వంసం చేస్తున్నారు. ఆ ట్రీ గార్డు ఐరన్ రాడ్లు రోడ్డుపైకి చొచ్చుకు రావడంతో పలువురు వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు వచ్చే మార్గంలో ట్రాన్స్ పోర్టు కార్యాలయాలు ఎక్కువగా ఉన్నాయి. పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే



ట్రీ గార్డులు తొలగించిన దృశ్యం

లారీలు పెట్రోల్ బంక్ పక్కన పార్కింగ్ యార్డులో, ట్రాన్స్ పోర్టు కార్యాలయాల వెను పార్కింగ్ చేస్తుంటారు. వీరు భోజన, ఇతర అవసరాల కోసం నాతయ్యపాలెం వైపు ఉన్న దాబాలు, హోటళ్లకు వస్తుంటారు. ఆ సమయంలో రోడ్డు దాటడానికి ట్రీ గార్డులు అవాంతరంగా ఉండటంతో ధ్వంసం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీరితో పాటు ఇనుము, తుక్కు సామగ్రి సేకరించి వారు కూడా ట్రీగార్డులను స్క్రాప్ దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఇదే విధంగా భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ మధ్యలో కూడా ట్రీ గార్డులను ధ్వంసం చేసి ఐరన్ రాడ్లు మాయం చేసిన పరిస్థితి ఉంది.

సంజీవరెడ్డి దృష్టికి ఉక్కు సమస్యలు



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డితో స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డిని శనివారం హైదారాబాద్‌లో స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు కలిశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతన సవరణ సమస్యతో పాటు సదుపాయాలు కోల్పోతున్న విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంజీవరెడ్డిని కలిసిన వారిలో గరికిన మోహనరావు, వి.జె.శేఖర్, ఉప్పలపాటి అశోక్‌రాజు, దేవిశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా..



వుడాకాలనీ ప్రధాన మార్గం పరిస్థితి



రహదారిపై పడిన గుంతలు

పెదగంట్యాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెదగంట్యాడ మండలంలో పలు ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. వుడాకాలనీ నుంచి గాజువాక వెళ్లే రహదారి మరీ అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలు పడి కంకర బయటకు వచ్చింది.సమతా నగర్ సాయిబాబా ఆలయం నుంచి వంటిళ్ల జంక్షన్ వరకూ పూర్తిగా ఛిద్రమైంది. ఈ మార్గంలో నిత్యం వేలాది రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రోడ్డుపై ఎలా ప్రయాణించాలని వారంతా వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి రహదారుల మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

సబ్సిడీ సరకులు సక్రమంగా అందించాలి

ఆరిలోవ: రైతుబజార్లలో సబ్సిడీపై ఇస్తున్న టమాటా, ఉల్లిపాయలను వినియోగదారులకు సక్రమంగా అందించాలని అధికారులకు మార్కెటింగ్ శాఖ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(జేడీ) సుధాకర్ సూచించారు. ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. సబ్సిడీపై అందిస్తున్న టమాటా, ఉల్లిపాయల కౌంటర్లను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. రోజుకు ఎన్ని టన్నులు విక్రయం జరుగుతున్నాయో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల స్టాళ్ల వద్ద వినియోగదారుతో జేడీ మాట్లాడారు. బోర్డులపై ప్రకటించిన ధరలకు రైతులు, వ్యాపారులు సరకులు విక్రయిస్తున్నారా, ధరల్లో తేడాలు చెబుతున్నారా అంటూ ఆరా తీశారు. నాణ్యమైన సరకులు అందుబాటులో లేకపోతే ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కర్నూలు ఉల్లి రూ.37కి సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖాధికారి ఎస్.కె.యాసిన్, ఇంజినీర్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న జేడీ సుధాకర్

'కందుకూరి వీరేశలింగం'పై వక్తృత్వ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అనే అంశంపై మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించామని కళాభారతి కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు ఈ నెల 24న బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా సూర్యారావు, వేణు, రమణమూర్తి వ్యవహరించారని పేర్కొన్నారు. వివిధ పాఠశాలలు, కళాశాల స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన ప్రతులను తమకు చేరగానే నిష్ణాతులచే విజేతలను ఎంపిక చేయనున్నామని తెలిపారు. కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి విజేతకు రూ.3 వేలు, ద్వితీయ రూ.2 వేలు, తృతీయ రూ.1,000, ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని రాంబాబు పేర్కొన్నారు. ఈ నెల 24న జరిగే బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరు కానున్నారన్నారు.